దవాఖానాకు గ్రహణం వీడేనా?

- ఆపరేషన్ థియేటర్ మరూ అయ్యేనా?
- పదహారేళ్లుగా మూతబడిన కుటుంబ నియంత్రణ కేంద్రం
- వైద్యచికిత్సల కోసం పట్టణాలకు పరుగు
- ఎమ్మెల్యే చొరవతో పీహెచ్‌సీ భవనం మంజూరు


పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దేముల్: వైద్యసేవల్లో నాడు పేరుప్రఖ్యాతులు తెచ్చుకున్న ప్రాథమిక వైద్యశాలకు కొంతకాలంగా గ్రహణం పట్టింది. పీహెచ్‌సీల నిర్వహణలో వైద్యాధికారులు నిర్లక్ష్యం వలన ఆ దవాఖాన పూర్వవైభవం కోల్పోయింది. దీంతో స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. కు.ని. ఆపరేషన్ కాదుకదా.. ఏ చిన్న జబ్బుచేసినా వైద్యోనారాయణ అంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణ ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు.

8 గంటలకు పరిమితం

సుమారు 16 ఏళ్ల క్రితం పెద్దేముల్ మండలంలో కు.ని థియేటర్ మూతబడి.. శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కునికోసం, తదితర వైద్య సేవల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. గతంతో పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ (టుబక్టమి)ఆపరేషన్‌తో పాటు ఇతర శస్త్రచికిత్సలు ఇక్కడే జరిగేవి. బంట్వారం, కోటపల్లి, ధారూర్ మండల ప్రజలు ఇక్కడికి వచ్చేవారు. అప్పట్లో ఏడు రోజులు, 24గంటల వైద్యంతో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం 8గంటల పాటు వైద్య సేవలు పరిమితం కావడం, ఆస్పత్రిలో కనీస వసతులు కరువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పూర్వ వైభవం తేవాలి

కర్ణాటక సరిహద్దులో మండలం ఉండటంతో మారుమూల ప్రాంత ప్రజలకు 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం.. పలు సౌకర్యాలతో పాటు, కుని శస్త్రచికిత్స థియేటర్, ఇద్దరు వైద్యులు, సిబ్బందికి క్వార్టర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసింది. కానీ క్రమంగా ఇప్పుడు ఆ వైద్యాలయంలో రోగులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కు.ని ఆపరేషన్ థియేటర్ మూతబడి.. ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరలేదన్న విమర్శలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లోనూ వైద్యం లభించక తాండూరుకు వెళ్లవలసి వస్తోందని, పట్టించుకునే వారు లేక.. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు, వృద్ధులు ఆవేదన వెలుబుచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూతబడిన కు.ని థియేటర్‌కు మరమ్మతు చేయించాలని, వైద్యాలయానికి పూర్వవైభవం తీసుకొస్తూ.. 24 గంటల పాటు వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఐదు ఎకరాల్లో..

1959లో ఐదెకరాల్లో ఆరు పడగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. 37 జీపీలకు ఈ ఆస్పత్రే పెద్దదిక్కు. దాత గురువప్ప ఇచ్చిన ఐదెకరాల భూమిలో ఆస్పత్రి, కుని శస్త్రచికిత కేంద్రం, వైద్యుల కోసం నివాసాలు నిర్మించారు. నిరంతరం నిత్యం రోగులతో కిటకిటలాడిన ఆ ఆస్పత్రిలో 24 గంటల పాటూ వైద్యసేవలు అందేవి. దాన్ని 8 గంటలకు కుదించారు.


మూతబడిన కు.ని శస్త్రచికిత్స కేంద్రం

వైద్య సిబ్బందినీ తగ్గించారు. కు.ని. థియేటర్‌ను మూసేశారు. దీంతో ఆయా భవనాలు శిథిలావస్థకు చేరి.. మొండిగోడలు దర్శనం ఇస్తున్నాయి.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మహర్దశ వచ్చింది. పీహెచ్‌సీ కొత్త భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. ఏటా లక్షలు ఖర్చు పెట్టి మరమ్మతులు చేసినా.. లాభం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొన్నారు. గత్యంతరం లేక వైద్య సిబ్బంది అక్కడే వైద్య సేవలు చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే చొరవ తీసుకొని నూతన భవన నిర్మాణం కోసం రూ.1.5 కోట్ల నిధులు మంజురు చేయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

నిర్మాణం నాణ్యతగా ఉండాలి

వికారాబాద్ అర్బన్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను నాణ్యతతో చేయాలని, అధికారుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. గురువారం వికారాబాద్ రైతు బజారు వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణపు పనులను రంగారెడ్డి డివిజన్ పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలని, మార్కెట్ పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం ఆలంపల్లిలో రూ.1 కోటితో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీయుఎఫ్ఐడీసీ ఎస్సీ రమణమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రభాకర్ రెడ్డి, రంగారెడ్డి డివిజినల్ పబ్లిక్ హెల్త్ డీఈఈ సాజిద్, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

జాతీయ స్థాయిలో రాణించాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి.. నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సూచించారు. గండీడ్ మండల పరిధిలోని రుసుంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కూతురు నందిని.. వాలీబాల్ అండర్ 16 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో క్రీడాకారిణి నందినిని ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

క్రీడలతో సత్సంబంధాలు మెరుగు

పరిగి: క్రీడలు ఆడటం వలన గ్రామాల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. గడిసింగాపూర్ గ్రామంలో గోవిందపూర్ సుజాతమ్మ స్మారక క్రికెట్ టోర్నీ నిర్వహించారు. గురువారం జరిగిన తుదిపోరులో విజేతగా నిలిచిన గడిసింగాపూర్‌కు మొదటి బహుమతిగా షీల్డ్, రూ.40 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బుద్లాపూర్‌కు షీల్డ్, రూ.20వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని సూచించారు. ఆటలు ఆడటం వలన ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉంటుందని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పూడూరు: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానమని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాకంచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఆర్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకుడు ఆనంద్‌కుమార్ లాహోటి అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని లాహోటీ రెసిడెన్సీలో జియోలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల సహకారంతో 30మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం నిర్వాహకులు రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు.


రక్తదానం చేస్తున్న పలువురు

‘చంద్రవంచ’ రూపురేఖలు మారుస్తాం

- గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తా
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: చంద్రవంచ గ్రామానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో కంటి వెలుగు పథకం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ సీఎం చేయని అభివృద్ధి మన ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్నారని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. గ్రామానికి త్వరలో అనుకున్న నిధులు మంజూరు చేస్తానని, 2,3 నెలల్లో చంద్రవంచ రూపురేఖలు మారుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీదేవి, నాయకులు ఉమాశంకర్, రవి శంకర్ పటేల్, విజయ్, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

డైనమిక్ లీడర్ ఉమాశంకర్

చంద్రవంచ గ్రామానికి చెందిన యువ నాయకుడు పటేల్ ఉమాశంకర్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభినందించారు. ఎప్పుడూ తన గ్రామం కోసం తపన పడే వ్యక్తి, కష్టపడే తత్వం, ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి ఉమాశంకర్ అని కొనియాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ఆదరిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..

- ప్రజాసేవే ఆ ప్రథమపౌరురాలి యావ
- సొంత నిధులతో కార్యక్రమాలు

పూడూరు: ఎదిగిన కొద్దీ.. ఒదిగి ఉండాలని, సంపాదించిన దాంతో నలుగురికి సేవ చేయాలనే తపనతో ప్రజలను ఆదరిస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు తిర్మలాపూర్ సర్పంచు కమ్లీబాయి. గ్రామంలో ఎక్కడ ఆడ బిడ్డల వివాహం జరిగినా పుస్తె మెట్టెలతో పాటు రూ.10 వేలు సహాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్, పొయ్యిలను పంపిణీ చేస్తున్నారు. మోడల్ స్కూల్‌లో చదివే 350 మంది విద్యార్థులకు సొంత డబ్బులతో ఉచితంగా బస్‌పాస్‌లను అందజేశారు. రాకంచర్ల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.2 లక్షలు వెచ్చించి, భక్తుల కోసం షెడ్‌ను నిర్మింపజేశారు. పక్షం రోజులుగా వికారాబాద్ ఎస్ఏపీ కళాశాల మైదానంలో ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్ తీసుకుంటున్న 500 మంది యువతకు నిత్యం 100 లీటర్ల పాలు, గుడ్లు, వంద డజన్ల అరటి పండ్లు ఆహారంగా అందజేస్తున్నారు. ఎక్కడ టోర్నీ ఏర్పాటు చేసినా.. ఆర్థిక సహాయం చేసి క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ.. ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు.


వివాహం కోసం పుస్తె మెట్టెలు అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

22న బోనాల జాతర

తాండూరు టౌన్: శ్రీరక్తమైసమ్మ అమ్మవారి బోనాల జాతర ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, 9 గంటలకు పల్లకి సేవ, ఊరేగింపు, 11 గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.10 కోట్ల నిధులు విడుదల చేశారని, ఇందులో రూ. 2కోట్లను మైనార్టీలకు కేటాయిస్తూ నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలున్నా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూరు పట్టణాలలోని షాదీఖానాలకు రూ.50 లక్షల చొప్పున కేటాయిస్తూ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, మద్దూరు సలీం, గౌసన్, ముక్తార్ అహ్మద్, సయ్యద్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్టీకి పూర్వవైభవం తేవాలి

కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి

మర్పల్లి: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలను గద్దె దించే వరకు పోరాడాలని, ప్రజా సంక్షేమానికి పాటుపడుతూ.. రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం దామస్తాపూర్, శాపూర్, కల్‌ఖోడ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ సాగర్, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రాచన్న, సురేష్, రఫియోద్దిన్, మధుసూదనరెడ్డితో కలిసి పల్లెపల్లెకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వరంగల్‌లో రాహుల్ గాంధీ ఆమోదించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామనా చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అశోక్‌రెడ్డి, కార్య దర్శులు సంజీవరెడ్డి, ప్రభాకర్, మైనార్టీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమోద్దిన్, బీసీసెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నగేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ నసీరొద్దిన్, బూచన్‌పల్లి, పట్లూర్ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, మంజుల, రావులపల్లి సర్పంచ్ నల్ల దేవమ్మ, కోట్‌మర్పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారి

నవాబుపేట: కెనరా బ్యాంకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగించుకోవాలని ఆ బ్యాంకు ఏఈఓ నిఖిత సూచించారు. కెనరా బ్యాంకు పులుమామిడి వారి ఆధ్వర్యంలో గురువారం మాదిరెడ్డిపల్లి, చిట్టిగిద్ద గ్రామాల్లో వ్యవసాయ రుణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు బ్యాంకు అందిస్తున్న సేవలను, ఇస్తున్న రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు బ్యాంకు పాల ఉత్పత్తి, పశుసంపద, పశుపోషణ, ఎడ్లు, బండి, బోర్లు, బావులు ఉన్న రైతులకు పైపులైన్లు, తదితర వాటిపై తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు యశోద, శ్రీలత, బ్యాంకు సిబ్బంది, భాస్కర్, అన్నదాతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలు లాభసాటి

వ్యవసాయాధికారి పద్మావతి

బొంరాస్‌పేట: వరిలో కాలిబాటలు దిగుబడిని పెంచి మేలుచేస్తాయని మండల వ్యవసాయాధికారిణి పద్మావతి సూచించారు. గురువారం మండల పరిధిలోని రేగడిమైలారం, దుద్యాల మండలం గౌరారంలో వరిపంట సాగులో రైతులకు కాలిబాటలు, ఇతర అధిక దిగుబడి, తక్కువపెట్టుబడి పద్ధతులు సూచించారు. వరిసాగులో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంలో కాలిబాటలు వదులుకోవాలన్నారు. దీనివల్ల ఎక్కువ గాలి పైరులోకి ప్రవేశించి ఆక్సిజన్ అందజేస్తుందని చెప్పారు. దీంతో కిరణజన్యసంయోగ క్రియ బాగా జరిగి మొక్కలు పచ్చదనంతో నిండి, ఎక్కువ దుబ్బునిండి అధిక దిగుబడినిచ్చే అవకాశాలున్నాయని సూచించారు. అలాగే ఎరువులు చల్లేందుకు వీలుంటుందన్నారు. జింకు లోపాన్ని గుర్తించి నివారణకు 2గ్రాముల జింకుసల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏఓతోపాటు ఏఈఓలు రేణుక, హేమ ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

పూడూరు: పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సోమన్‌గుర్తి జిల్లా పరిషత్ పాఠశాల గురువారం వేదికగా మారింది. 2010–11 విద్యాసంవత్సరానికి చెందిన నాటి విద్యార్థులు పిల్లాపాపలతో కలుసుకొని.. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేశారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో సరదాగా మాట్లాడుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

టోర్నీ విజేతగా దౌలాపూర్

యాలాల: ఈ నెల 9న నిర్వహించిన ఎంఎం క్రికెట్ టోర్నీ గురువారంతో ముగిసింది. మండలంతో పాటు పొరుగు మండలాల నుంచి దాదాపు 22 జట్లు పోటీలో పాల్గొన్నాయి. కాగా ఈ టోర్నీ తుదిపోరులో మండలంలోని దౌలాపూర్, విశ్వనాథ్‌పూర్ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో దౌలాపూర్ జట్టు విజేతగా నిలవగా, విశ్వనాథ్‌పూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకుడు మహిపాల్ ట్రోఫిని అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ఆరీఫ్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఎదుట.. బావి

భయాందోళనలో విద్యార్థులు

తాండూరు రూరల్: పాఠశాల చెంతనే ప్రమాదం పొంచి ఉంది. పురాతన కాలం నాటి ఆ బావి.. ప్రస్తుతం వాడుకలో లేదు. కాలానుగుణంగా ఊరుపెరిగి.. ఊరు మధ్యలోకి వచ్చినట్లయింది. అదీ.. 200 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాల ప్రధాన గేటువద్ద ఎటువంటి రక్షణ లేకుండా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చెంగోల్ గ్రామస్తులు, విద్యార్థులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. పల్లెప్రగతిలో పాడుబడిన ఇళ్లు, బావులను కూల్చాలని, పూడ్చాలని ఆదేశాలు ఉన్నా.. అవి అమలు కాలేదు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి బావిని పూడ్చడమో.. లేదంటే దానిపై ఇనుపకంచె ఏర్పాటు చేయించడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల ఎదురుగా ఉన్న పాతబావి

క్లుప్తంగా

‘108 వాహనాలు కండీషన్‌లో ఉండాలి’


రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్ కిషోర్

కొడంగల్ రూరల్: ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించేందుకు వాహనాలు ఎప్పటికప్పుడు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని 108వాహన ఆడిటర్ కిషోర్ సూచించారు. గురువారం ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్ పనితీరు, రికార్డులను పరిశీలించారు. వాహనంలోని పరికరాలను, ఎక్‌మెస్ పనితీరు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే స్పందిస్తూ క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు చురుగ్గా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వాహన సిబ్బంది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు

యాలాల: కోకట్ శివారులోని చెరువులో చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను వెంటనే ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ పనుల పేరిట ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతున్నారని, విషయం తెలిసినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జైపాల్, వెంకటయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

నూతన కమిటీ నియామకం


నియామకపత్రాలను అందజేస్తున్న అధికారులు, నేతలు

కుల్కచర్ల: మత్స్యకారుల అభివృద్ధి జరగాలంటే ముదిరాజ్‌లు కలిసికట్టుగా ఉండాలని ముజాహిద్‌పూర్ మత్స్యకార సంఘం అధ్యక్షుడు పోమాల అనంతయ్య అన్నారు. గురువారం గ్రామంలో నూతనంగా సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించుకుంటూ ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పోమాల అనంతయ్య, ఉపాధ్యక్షుడిగా బిచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా భీమయ్య, డైరక్టర్లుగా ఆంజనేయులు, నర్సింహులు, రాములు, ఎల్లయ్య, గౌరమ్మ, మల్లమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం ఆడిటర్ అజ్మత్ పాష ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైపులైను లీకేజీ


రోడ్డుపై పారుతున్న భగీరథ నీరు

మోమిన్‌పేట: మిషన్ భగీరథ నీరు రోడ్డు పాలవుతున్నా పట్టించుకునే వారులేరని వేంకటేశ్వర కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. లీకేజీ వలన తమకు తాగు నీరు రావడం లేదని, మూడు రోజులుగా సరఫరా కాకున్నా.. ఇటువైపు చూసేవారు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు లేకపోవడంతో పక్క వీధిలోంచి రెండుమూడు బిందెలు తెచ్చుకుంటున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేయించి, తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

మర్పల్లి: ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. గురువారం మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో కొందరు దుర్గమాత ఆలయ నిర్మాణం కోసం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందిర మందిర నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు స్వప్న, గ్రామ కమిటీ రైతుబంధు అధ్యక్షుడు శేఖర్‌స్వామి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.